క్లుప్తంగా

మూల పెద్దమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



గడివేములలో మూలపెద్దమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

గడివేముల: మండల కేంద్రమైన గడివేములలో వెలసిన మూల పెద్దమ్మవారి ఆలయంలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వేకువజాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అమ్మవారికి కుంకుమార్చన, ఆకుపూజ వంటి విశేష పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు వాల్మీకి సేవా సమితి ఆధ్వర్యంలో అన్నప్రసాదాలు అందించారు.

పోస్టర్ల ఆవిష్కరణ



పశువైద్య శిబిరాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ శారద

కల్లూరు: గ్రామాల్లో జరుగుతున్న పశు వైద్య శిబిరాల పోస్టర్లను మంగళవారం కల్లూరు ఎంపీపీ శారద ఆవిష్కరించారు. మంగళవారం సల్కాపురం గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరానికి హాజరై పాడి రైతులకు పశు వైద్యులు అందుబాటులో ఉండాలని సూచించారు. గొర్రెలు, మేకలు, పొట్టేళ్లు, పశువులకు నట్టల నివారణ మందును పర్ల పశు వైద్యులు అమృత, సిబ్బంది తాపించారు. సర్పంచ్ మద్దిలేటి, పాడి రైతులు పాల్గొన్నారు.

రోబోటిక్స్‌పై విద్యార్థులకు శిక్షణ



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సునీల్‌కుమార్

పాణ్యం: మండల పరిధిలోని ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం రోబొటిక్స్ అంశంపై మెకానికల్ మూడవ సంవత్సరం విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. బెంగళూరు యూనిఫెస్ట్ రోబోట్ సంస్థ ఎండీ సునీల్‌కుమార్ ఐదు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. రోబోల తయారీ, విడి భాగాల అనుసంధానం, వాటి పని తీరును క్షుణ్ణంగా వివరించారు. రోబోల వినియోగం వల్ల పలు రంగాల్లో నూతన విప్లవం తీసుకురావొచ్చని మెకానికల్ హెచ్‌ఓడీ తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. శిక్షణ అనంతరం విద్యార్థులు గ్రూపులుగా ఏర్పడి సొంతంగా ప్రాజెక్టులను చేపట్టాలన్నారు. మంచి ప్రాజెక్టు తయారు చేసిన విద్యార్థులకు కళాశాల ప్రోత్సాహకం అందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జయచంద్రప్రసాద్, డీన్ అశోక్‌కుమార్, డాక్టర్ అల్తాఫ్‌హుసేన్, డాక్టర్ సిద్దారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్న కారణాలతో పదేపదే తిప్పకోవద్దు

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థకు వివిధ పనుల నిమిత్తం ప్రతి రోజు ప్రజలు వస్తుంటారని, అటువంటి వారికి చిన్న చిన్న కారణాలతో పదే పదే తిప్పుకోవద్దని నగరపాలక మేనేజర్ చిన్నరాముడు అన్నారు. మంగళవారం స్థానిక నగరపాలక సంస్థలో పన్ను వసూళ్లు, ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, జనన మరణ ధ్రువీకరణ పత్రాల జారీ విభాగాలను మేనేజర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉద్యోగులు ప్రజల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరపాలకలోని ముఖ్యమైన విభాగాల్లో పనిచేసే సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలన్నారు. కార్యాలయానికి వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. పని వేళల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.

రాజకీయ కుట్రతోనే వాల్మీకులకు ద్రోహం

కర్నూలు(అర్బన్): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1956కు ముందు ఎస్టీలుగా ఉన్న వాల్మీకులను కొందరు రాజకీయ కుట్రతో విభజించి ద్రోహం చేశారని వాల్మీకి నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక బీసీ భవన్‌లో జరిగిన సమావేశంలో సీనియర్ వాల్మీకి నాయకులు కుబేర స్వామి, మహర్షి వాల్మీకి రిజర్వేషన్ ప్రజా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పులికొండన్న, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు నాగేశ్వరినాయుడు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. ఎస్టీలుగా ఉన్న వాల్మీకులను ప్రాంతీయ వ్యత్యాసంతో మైదాన ప్రాంతాల్లోని బోయలను బీసీలని, ఏజెన్సీలోని వారిని ఎస్టీలుగా విభజించి ద్రోహం చేశారన్నారు. అప్పటినుంచి తమను ఎస్టీలుగా పునరుద్ధరించాలని పోరాటాలు చేస్తున్నా, పాలకులు మోసం చేస్తూనే ఉన్నారన్నారు. పైగా వాల్మీకులు ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందారని తప్పుడు ప్రచారం చేస్తున్నారని వాపోయారు. తాము కొత్తగా ఎస్టీలో చేర్చమని కోరడం లేదని, పునరుద్ధరనే అడుగుతున్నామన్నారు. నేతలు పెద్దయ్య, సుధాకర్‌నాయుడు, నరసింహులు, సాయి, వంశీ, నాయుడు పాల్గొన్నారు.

నిర్వహణకు నోచుకోక..

ఆహ్లాదం పంచలేక

- అధ్వానంగా దిన్నెదేవరపాడు పార్కు
- పిచ్చిమొక్కలు, చెత్తాచెదారంతో కళావిహీనం
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం



నిర్వహణకు నోచుకోని దిన్నెదేవరపాడు పార్కు



పార్కులో నిలిపిఉంచిన కాంక్రీట్ మిక్సింగ్ యంత్రం



గతంలో పచ్చదనంతో కళకళలాడిన పార్కు (ఫైల్)

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని దిన్నెదేవరపాడు గ్రామం ఎస్సీ కాలనీలో దాదాపు 55 సెంట్ల విస్తీర్ణంలో ఉన్న విలేజ్ పార్క్ నిర్వహణకు నోచుకోక అధ్వానంగా మారింది. ప్రస్తుతం పార్కులో ఎక్కడ చూసినా చెత్త, వ్యర్థాలు కనిపిస్తున్నాయి. గ్రామ పంచాయతీ అధికారులు పార్కును పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. 2018–2019లో దిన్నెదేవరపాడు గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా రూ.3.50 లక్షల నిధులతో ప్రజల సౌకర్యార్థం పార్కును ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీ అధికారులు కొన్నేళ్లు పార్కును సక్రమంగా నిర్వహించారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రసుత్తం ఉన్న గ్రామ పంచాయతీ అధికారులు పార్కు నిర్వహణను గాలి కొదిలేశారు. దీంతో పార్కులో ఏర్పాటుచేసిన వ్యాయామ పరికరాలు, ఆట వస్తువులు శిథిలావస్థకు చేరాయి. కొన్ని వస్తువులు కనబడకుండా పోయాయి.

అధికారులు పట్టించుకోకపోవడంతో చుట్టుపక్కల నివాసం ఉంటున్న వారు పార్కులో వంట చెరుకును నిల్వ ఉంచారు. మరికొంత మంది ఇంటి నిర్మాణ పనులకు ఉపయోగపడే యంత్రాలను పార్కులో నిలుపుతున్నారు. కంపచెట్లు, పిచ్చి మొక్కలతో పార్కు కళావిహీనంగా తయారైంది. రాత్రి సమయాల్లో మందుబాబులకు అడ్డాగా మారిపోయింది. గ్రామ జనాభా 4 వేలు, సమీపాన వెలసిన కాలనీల జనాభా మరో 4 వేలు ఉన్నా పార్కు అధ్వానంగా మారడంతో ప్రజలు ఇక్కడికి రావడమే మానేశారు. దీంతో గతంలో పచ్చని మొక్కలతో కళకళలాడిన పార్కు ప్రస్తుతం పిచ్చి మొక్కలు, వ్యర్థాలతో కళావిహీనంగా మారింది.



పిచ్చిమొక్కలు, చెత్తాచెదారంతో నిండిన పార్కు



పార్కులో సమీప ఇళ్లవారు ఉంచిన వంట చెరకు

సస్యరక్షణతోనే మిర్చిలో అధిక దిగుబడులు



కొండాపురంలో మిర్చి రైతు శంకర్‌రెడ్డిని సన్మానిస్తున్న విత్తన కంపెనీ అధికారులు

సి.బెళగల్: రైతులు సరైన సస్యరక్షణ పద్ధతులను పాటిస్తేనే మిర్చి పంటలలో అధిక దిగుబడులు సాధ్యమవుతాయని హెచ్‌ఎం క్లాజ్ మిర్చి విత్తన కంపెనీ ఏపీ, తెలంగాణ ఏరియా సేల్స్ మేనేజర్ (ఏఎస్‌ఎం) సతీష్ అన్నారు. మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు శంకర్‌రెడ్డి పొలంలో సాగు చేసిన హెచ్‌ఎం క్లాజ్ కంపెనీ అగ్ని ఎఫ్ – 1 రకం మిర్చి పంట అధికంగా కాపురావడంతో కంపెనీ ప్రతినిధులు మంగళవారం పొలం సందర్శనకు వచ్చారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మిర్చి పంట సాగులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేసి, తమ కంపెనీ రకం విత్తన పంటతో వచ్చే లాభాలపై రైతులతో చర్చించారు. ఈ సందర్భంగా శంకర్‌రెడ్డిని సంస్థ ప్రతినిధులు శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. అగ్ని ఎఫ్ – 1 రకం మిర్చి పంటతో అధిక దిగుబడి పొందినట్లు శంకర్‌రెడ్డి తెలిపారు. జిల్లా సేల్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ మల్లయ్య, ఉపసర్పంచ్ పల్‌దొడ్డి సుంకన్న, తదితరులు ఉన్నారు.

కోలుకోలేక యువకుడి మృతి

ఓర్వకల్లు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఎస్‌ఐ సునీల్ కుమార్ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని హుసేనాపురం గ్రామానికి చెందిన సంకలి దస్తగిరి కుమారుడు రవికుమార్ (25) ఈ నెల 18వ తేదీన రాత్రి 8 గంటల సమయంలో ఏపీ 21 ఎల్ 6500 నంబర్ గల మోటార్ సైకిల్‌పై హుసేనాపురం నుంచి ఓర్వకల్లుకు వెళుతుండగా కుక్క అడ్డురావడంతో తప్పించే క్రమంలో అదుపుతప్పి రోడ్డుపై పడడంతో రక్త గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అతన్ని చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తండ్రి దస్తగిరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి ఇంకా వివాహం కాలేదని పేర్కొన్నారు.

మేలు జాతి దూడలతో అధిక పాల ఉత్పత్తి



మాట్లాడుతున్న పశుసంవర్థక శాఖ జిల్లా సంయుక్త సంచాలకులు శ్రీనివాస్

కోడుమూరు రూరల్: లింగ నిర్ధారిత వీర్యం ద్వారా పుట్టే మేలు జాతి దూడల ద్వారా అధిక పాల ఉత్పత్తిని సాధించవచ్చునని పశుసంవర్థక శాఖ జిల్లా సంయుక్త సంచాలకులు శ్రీనివాస్ పాడి రైతులకు సూచించారు. మండలంలోని అమడగుంట్ల గ్రామంలో మంగళవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో లేగ దూడల ప్రదర్శన– పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువులు ఎదకొచ్చినప్పుడు కృత్రిమ గర్భధారణ ద్వారా ఎద సూదులు వేయించడం వల్ల మేలు జాతి దూడలు పుడతాయన్నారు. దూడకు దూడ ఎడం తగ్గించి ఆవులు సంవత్సరానికి ఒక ఈత, గేదేలు 14 నెలలకు ఒక ఈత ఈనేలా చూసుకోవాలని సూచించారు. అనంతరం పాడి రైతులకు చెందిన మేలు జాతి దూడలను ప్రదర్శించి బాగున్న దూడల యజమానులకు బహుమతులను అందజేయడంతో పాటు, దూడలకు వచ్చే రోగాల నివారణకు, నట్టల నివారణకు సంబంధించిన మందులను ఉచితంగా అందజేశారు. కర్నూలు డివిజన్ ఉపసంచాలకులు డాక్టర్ ప్రసన్నబాబు, జిల్లా పశుగణాభివృద్ధి అధికారి రాజశేఖర్, కోడుమూరు సహాయ సంచాలకులు రామ సుబ్బారెడ్డి, డీఎల్‌డీఓ చంద్రమోహన్, స్థానిక పశువైద్యాధికారి అమృత్‌కుమార్ రెడ్డి, ఏడీ మల్లన్న, బాల స్వామి, రబిబాబు తదితరులు పాల్గొన్నారు.

హరిజనవాడ పాఠశాలను విలీనం చేయొద్దు



డీఈఓ శామ్యూల్ పాల్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

ఓర్వకల్లు: మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో హరిజనవాడ పాఠశాలను మెయిన్ స్కూల్‌లో విలీనం చేయరాదని ఎంఆర్‌పీఎస్ మండల ఉపాధ్యక్షుడు నారాయణ, రిటైర్డు ఉపాధ్యాయుడు మద్దిలేటి డీఈఓకు విన్నవించారు. మంగళవారం గ్రామానికి చెందిన విద్యార్థుల తల్లితండ్రులు కర్నూలు డీఈఓ కార్యాలయానికి చేరుకొని గ్రామంలోని హరిజనవాడ పాఠశాలలో చదివే 1, 2 తరగతుల పిల్లలను ఇతర పాఠశాలకు తరలించాలనే ఆలోచనను విరమించుకోవాలని కోరారు. అంతేగాక, మెయిన్ స్కూల్‌లో విలీనం చేసిన 3, 4, 5 తరగతుల విద్యార్థులను హరిజనవాడ పాఠశాలలోనే కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. పాఠశాలను మార్చితే విద్యార్థులకు తలెత్తే సమస్యలను గూర్చి వివరిస్తూ వినతి పత్రం అందజేశారు. అందుకు డీఈఓ శామ్యూల్ పాల్, ఎంఈఓ ఓంకార్ యాదవ్ సానుకూలంగా స్పందిస్తూ.. విద్యార్థులను ఎక్కడా విలీనం చేయకుండా అక్కడే కొనసాగిస్తామని భరోసాఇచ్చారు. స్థానిక ఎంఆర్‌పీఎస్ నాయకులు లచ్చిగారి శివుడు, బి.గోపాల్, పుల్లయ్య, సురేష్, చిన్న మద్దిలేటి పాల్గొన్నారు.

రహదారుల మరమ్మతులకు చర్యలు

కర్నూలు (టౌన్): నగరంలో అధ్వానంగా ఉన్న రహదారులకు మరమ్మతులు చేపట్టేందుకు ప్రతిపాదనలు రూపొందించాలని నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు సూచించారు. మంగళవారం స్థానిక నెహ్రూ నగర్, రాధాకృష్ణ థియేటర్ రోడ్డు, జమ్మిచెట్టు, వడ్డెగేరి, డాక్టర్స్ కాలనీ ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించారు. కాలనీల్లో ధ్వంసమైన రహదారులు, మురుగు కాల్వలను పరిశీలించారు. అలాగే గార్గేయపురం డంప్ యార్డులో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చేపట్టిన డ్రోన్ సర్వేను కమిషనర్ అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్‌ఈ రాజశేఖర్, ప్రజారోగ్య శాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి డీఈఈ క్రిష్ణలత, గంగాధర్ పాల్గొన్నారు.



రాధాకృష్ణ థియేటర్ సమీపంలో మ్యాన్‌హోల్ వద్ద మురుగును పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కష్టపడిన వారికి పదవులు



మాట్లాడుతున్న కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, ఆదిమూలపు సతీష్ తదితరులు

కర్నూలు(రూరల్): వైఎస్సార్‌సీపీలో కష్టపడిన వారికి పదవులు వరిస్తాయని పార్టీ కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త, కూడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్ అన్నారు. మంగళవారం కర్నూలు నగరంలోని కోట్ల హర్షవర్ధన్ రెడ్డి స్వగృహంలో కర్నూలు మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అందరం కలసి పార్టీని బలోపేతం చేద్దామని పిలుపునిచ్చారు. జగనన్న ఆశయాలకు అనుగుణంగా పని చేయాలని నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. పార్టీ కర్నూలు మండలాధ్యక్షుడు మోహన్‌బాబు, మండల ఉపాధ్యక్షుడు నెహేమ్య, నాయకులు శ్రీనివాసరెడ్డి, మహబూబ్ బాష, సంపత్‌కుమార్, వెంకటేశ్, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

వయోజన విద్యపై శిక్షణ



అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తున్న వయోజన విద్యాధికారి శ్రీనివాసులు

ఓర్వకల్లు: జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక పొదుపు భవనంలో వయోజన విద్యపై శిక్షణ కార్యక్రమం రెండో రోజు కొనసాగింది. 'ఉల్లాస్' సమాజంలో అందరికీ జీవితకాల అభ్యసన కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా టాటా కన్సల్టెన్సీ ప్రతినిధి తేజ మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో మహిళలను సంపూర్ణ అక్షరాస్యులుగా చేయాలని దృఢ సంకల్పంతో ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. మహిళలకు ఈ కార్యక్రమం ద్వారా కలిగే ప్రయోజనాలను గూర్చి వీడియో ద్వారా వివరించారు. జిల్లా వయోజన విద్య అదనపు విద్యాశాఖ అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ.. వివిధ గ్రామాల నుంచి వచ్చిన వలంటీర్ టీచర్లకు, పొదుపు మహిళలకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. ఈ తరగతులకు ఏపీఎం వెంకటరామిరెడ్డి, కాల్వ, శకునాల, కొంతలపాడు, ఉప్పలపాడు, ఉయ్యాలవాడ, లొద్దిపల్లె, కాల్వబుగ్గ గ్రామాలకు చెందిన వలంటీర్లు, సీసీలు, మండల మహిళా సమాఖ్య పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

విద్యతోనే బాలికలకు బంగారు భవిష్యత్



పోస్టర్లను విడుదల చేస్తున్న సీడీపీఓ అనురాధ, సిబ్బంది

ఓర్వకల్లు: విద్యతోనే ఆడపిల్లలకు బంగారు భవిష్యత్ కల్పించిన వారవుతారని సీడీపీఓ అనురాధ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో మంగళవారం కిశోర వికాసంపై అంగన్‌వాడీ టీచర్లకు, ఐసీడీఎస్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ అనురాధ మాట్లాడుతూ.. కౌమార వయస్సు పిల్లలకు ఆరోగ్య పరిస్థితులు, వారి అభివృద్ధి కోసం మార్గాల గూర్చి కిశోర వికాసంపై మండల స్థాయి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాలతో ప్రసవ సమయంలో ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. అనంతరం జరిగిన శిక్షణ తరగతులలో యుక్త వయస్సులో బాలికల్లో చోటు చేసుకొనే శారీరక, మానసిక మార్పులకు అనుగుణంగా సానుకూల ప్రవర్తన కలిగి ఉండేలా సూచనలు చేశారు. ఈ సందర్భంగా పోస్టర్లను విడుదల చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నజ్మా, అనూష, అంగన్‌వాడీ టీచర్లు, ఎంఎస్‌కేలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాతృమరణాలను నివారించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ

కర్నూలు(హాస్పిటల్): సమయానుసారంగా వైద్యం అందిస్తే మాతృమరణాలను నివారించవచ్చని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ చెప్పారు. ఆమె మంగళవారం తన ఛాంబర్‌లో మాతృమరణాలపై సమీక్ష, జిల్లాస్థాయి సమగ్ర గర్భస్రావ సంరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఇటీవల నవంబర్, డిసెంబర్ మాసాల్లో కలుదేవకుంట్ల పీహెచ్‌సీ పరిధిలోని తల్లులలో కర్నూలులోని జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్‌లో ఒకరు మరణించగా, ఎమ్మిగనూరు పట్టణంలోని ధీరన్ మెడికల్ ఆసుపత్రి నుంచి మరొకరిని కర్నూలుకు రెఫర్ చేయగా మార్గమధ్యంలో మరణించారు. క్షేత్రస్థాయిలోని సిబ్బంది, ఆశా, ఆరోగ్య కార్యకర్త, వైద్యాధికారులు రక్తహీనత గల గర్భవతులను త్వరగా గుర్తించి వారికి సరైన సమయంలో వైద్యసేవలు అందిస్తే మాతృ మరణాలను తగ్గించవచ్చని కమిటీ నిర్ధారించింది. గర్భవతుల్లో అధిక రక్తపోటు ఉంటే ఆరోగ్య కార్యకర్త, పర్యవేక్షకులతో ట్రాక్ చేసి సమీప సామాజిక ఆరోగ్య కేంద్రం, ఏరియా ఆసుపత్రులు, ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు 108 ద్వారా తరలించి చికిత్స అందించాలన్నారు. గర్భవతుల కుటుంబ సభ్యులకు చికిత్సపై అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ మాట్లాడుతూ గ్రామస్థాయిలో మహిళా ఆరోగ్య కార్యకర్తలు, పర్యవేక్షకులు రక్తహీనత, కుటుంబ నియంత్రణ పద్ధతుల గురించి అవగాహన కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ మాధవి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సత్యవతి, డీఐవో డాక్టర్ నాగప్రసాద్, డాక్టర్లు పద్మజ, ప్రియాంక, శ్రీధరశర్మ, రంగస్వామి, భావన, గణాంకాధికారి హేమసుందరం, తదితరులు పాల్గొన్నారు.

పెద్దాసుపత్రిలో వెల్‌నెస్ క్లినిక్ ప్రారంభం



వైద్య పరీక్షలు చేస్తున్న విధానాన్ని పరిశీలిస్తున్న ఆసుపత్రి అధికారులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో వెల్‌నెస్ క్లినిక్ (ఓపీ నంబర్ 333)ను మంగళవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఆసుపత్రిలోని జనరల్ సర్జరీ ఓపీ పక్కన ఏర్పాటు చేసిన ఈ వెల్‌నెస్ సెంటర్‌లో స్థూలకాయం వల్ల వచ్చే వ్యాధులు, జీవనశైలి జబ్బులు, వ్యాయామం, ఆహారం తీసుకునే విధానం తదితర విషయాల గురించి వైద్యులు వివరిస్తారన్నారు. దీర్ఘకాలిక జబ్బులు రాకుండా చేయడమే ఈ ఓపీ నిర్వహణ ఉద్దేశమని తెలిపారు. ప్రతి సోమ, బుధవారాల్లో ఈ ఓపీ కొనసాగుతుందని చెప్పారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు, సీఎస్‌ఆర్‌ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, ఎస్‌పీఎం హెచ్‌ఓడీ డాక్టర్ సుధాకుమారి, ప్రొఫెసర్ సింధియా శుభప్రద, అడ్మినిస్ట్రేటర్ పి.సింధు సుబ్రహ్మణ్యం, డాక్టర్లు శివబాల నాగాంజన్, కిరణ్‌కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రిబాయి తదితరులు పాల్గొన్నారు.

'పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తున్న మోదీ ప్రభుత్వం'

కర్నూలు(సెంట్రల్): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పెట్టుబడిదారులకు కొమ్ము కాస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ విమర్శించారు. మంగళవారం లెనిన్ 101వ వర్ధంతి సందర్భంగా సుందరయ్య భవన్‌లో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెట్టుబడిదారులు అభివృద్ధి చెందితే పాలక పక్షాలు వారికే కాపు కాస్తాయని లెనిన్ చెప్పిన మాటలను గుర్తు చేశారు. మోదీ పాలనలో అంబానీ, అదానీ అభివృద్ధి చెందారే తప్ప.. పేద ప్రజలు కూటి కోసం, గూడు కోసం పోరాటాలు చేస్తూనే ఉన్నారన్నారు. ఆయన స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటాలు చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. అలాగే నగరంలోని గడియారం ఆసుపత్రి వద్ద సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. లెనిన్ చిత్రపటానికి నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్, ఎస్‌ఎండీ షరీఫ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



పాడి రైతులకు మందులను పంపిణీ చేస్తున్న సర్పంచ్ సద్దల సుజిత్ రెడ్డి, అధికారులు



గుండ్రేవులలో పశు వైద్య శిబిరంలో మందులను అందజేస్తున్న దృశ్యం

కల్లూరు: గ్రామాల్లో నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశువైద్య అధికారి (జేడీ) జి.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం చిన్నటేకూరు, అమడగుంట్ల గ్రామాల్లో నిర్వహించిన పశువైద్య శిబిరాలను జేడీ శ్రీనివాస్, పశుసంవర్థక శాఖ డీడీ దుర్గ ప్రసన్న బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. జిల్లాలో అన్ని గ్రామాల్లో ముందస్తు ప్రణాళికల ప్రకారం పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లావ్యాప్తంగా 48 పశువైద్య శిబిరాలు నిర్వహించినట్లు తెలిపారు. పశువులకు సోకే వ్యాధులపై పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. శిబిరంలో పశువులు, మేకలు, గొర్రెలు, పొట్టేళ్లకు వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. చిన్నటేకూరు గ్రామంలో గర్భకోశ వ్యాధులు ఉన్న ఎనిమిది పశువులకు, 26 సాధారణ పశువులు, మేకలు, గొర్రెలు, పొట్టేళ్లకు వైద్యం అందించారు. పశుసంవర్థక అధికారులు మల్లన్న, శ్రీకాంత్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సి.బెళగల్: గ్రామాలలో నిర్వహిస్తున్న పశు వైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పోలకల్ పశు వైద్యుడు డాక్టర్ రోనాల్డ్ రీచర్డ్స్ సూచించారు. ఆయన మంగళవారం మండల పరిధిలోని గుండ్రేవుల గ్రామంలో పశు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి చికిత్స చేయడంతో పాటు యజమానులకు మందులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పశుపోషణపై రైతులు శ్రద్ధ వహించాలన్నారు. పశుపోషణ, ఆరోగ్య సమస్యలపై గ్రామాలలో అందుబాటులో ఉంటున్న సచివాలయ పశు సహాయకులను సంప్రదించాలని సూచించారు. పోలకల్ పశు వైద్యశాల పరిధిలోని ఇనగండ్ల గ్రామంలో 23వ తేదీన, 24న బ్రాహ్మణదొడ్డి, 27న మారందొడ్డి, 29న పోలకల్ గ్రామంలో ప్రత్యేక పశు వైద్య శిబిరాలను నిర్వహించనున్నట్లు డాక్టర్ రోనాల్డ్ రీచర్డ్స్ తెలిపారు. పశు వైద్య సహాయకులు జాహ్నవి, మహేంద్ర, రైతులు ఉన్నారు. చింతమానుపల్లెలో సి.బెళగల్ పశువైద్యుడు ప్రవీణ్‌కుమార్ తన సిబ్బందితో కలిసి ప్రత్యేక పశు వైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు వైద్యం చేసి యజమానులకు మందులను అందజేశారు. గ్రామ పెద్ద శ్రీనివాసులు రెడ్డి, పాడి రైతులు, పశు వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

పశువులకు రోగ నిరోధక టీకాలు

పాణ్యం: పాడి పశువులుకు ఆరోగ్య పరీక్షలు చేసి అవసరమైతే టీకాలు వేస్తున్నట్లు జిల్లా సంయుక్త సంచాలకులు మాధవరావు, గ్రామ సర్పంచ్ సద్దల సుజిత్‌రెడ్డి అన్నారు. మంగళవారం కొండజుటూరులో గ్రామంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలోని మొత్తం 365 పశువులకు చికిత్సలు చేసి మందులు అందించామన్నారు. ఆవులు, ఎద్దులు, మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందులు తాపించినట్లు చెప్పారు. గొర్రెలు, పొట్టేళ్లు, మేకలకు మసూచీ వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు వెల్లడించారు. అలాగే పాడి రైతులకు పశువులకు సంబంధించిన మందులు అందజేశారు. ఉప సంచాలకులు శ్రీనివాసరావు, సహాయ సంచాలకులు కమలాకర్, గోరుకల్లు వైద్యురాలు సులోచన తదితరులు పాల్గొన్నారు.